ఆంధ్రజ్యోతి
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 19 జూలై 2025



ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ

పార్వతీపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఔత్సాహిక పారి శ్రామిక వేత్తలకు ర్యాంప్ పథకంలో భాగంగా ఉచిత శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. ట్రిడ్జ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో వ్యవస్థాపకత, నైపుణ్య అభివృద్ధిపై నెల రోజుల పాటు కురుపాం, పాలకొండ, సాలూరులో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 89859 22855(పాలకొండ), 93815 51258 (సాలూరు), 95421 49076 (కురపాం), జిల్లా కో ఆర్డినేటర్ 98851 17831 నెంబర్లను సం ప్రదించాలన్నారు. 18 నుంచి 58 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు.

అమ్మో.. జ్వరం

- మంచం పట్టిన మన్యం
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లతో ప్రజల అవస్థలు
- ఆసుపత్రుల్లో రోజూ వందల సంఖ్యలో ఓపీ
- పెరుగుతున్న ఇన్‌పేషెంట్లు.. చాలని పడకలు
- వార్డులన్నీ కిటకిట.. వేధిస్తున్న వసతి సమస్య



జిల్లా కేంద్రాసుపత్రిలోని ఓ వార్డులో రోగులు ఇలా..

మన్యం జిల్లా మంచం పట్టింది.. సీజనల్ వ్యాధులతో వణుకుతోంది. వాతావరణ మార్పులు.. పారిశుధ్య లోపం తదితర కారణాలతో రోజురోజుకూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎక్కడ చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. ఇంటికి ఒకరిద్దరు చొప్పున మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్నారు. మరోవైపు జిల్లాలో ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. రోజూ వందల సంఖ్యలో ఓపీ నమోదువుతోంది. అత్యధికులు ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. దీంతో వార్డులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. అయితే వైద్యం కోసం వచ్చే వారికి వసతి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. పడకలు చాలక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు సర్దుకోవాల్సి వస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

రోజుకి 800 నుంచి 900 వరకు ఓపీ

పార్వతీపురం టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో రోజూ 900 వరకు ఓపీ నమోదవుతోంది. వారిలో 50 శాతం మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. దీంతో ఆసుపత్రిలో అన్ని వార్డులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. శుక్రవారం ఆసుపత్రిలో 800 వరకూ ఓపీ నమోదవగా.. వారిలో మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నవారు అత్యధికంగా ఉన్నారు. జిల్లాలోని 15 మండలాలతో పాటు గిరిజన, మైదాన ప్రాంతాలకు చెందిన రోగులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో 150 పడకలు ఉన్నా.. రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వసతులు లేవు. దీంతో ఇన్‌పేషెంట్లకు అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా రోగుల బంధువులు, సహాయకులు జిల్లా కేంద్రాసుపత్రి బయట ఉన్న చిన్న చిన్న షెడ్లలో తల దాచుకోవాల్సి వస్తోంది. వర్షం కురిస్తే ఇక అంతే సంగతి. ఆ షెడ్లలో ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఆసుపత్రిలో రోగులకే భోజన సౌకర్యం కల్పించడం వల్ల వారి బంధువులు బయట ఆహారాన్ని కొనుక్కోలేక పస్తులు ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా గిరిజనులు స్వచ్ఛంద సంస్థలు అందించే భోజనం కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. రోగుల బంధువుల కోసం ఆసుపత్రిలో ప్రత్యేక గదులను కేటాయించి తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకులు, వైద్యాధికారులు భావించారు. అయితే 2019లో పాలన పగ్గాలు చేపట్టిన వైసీపీ ప్రభుత్వం రోగుల బంధువుల సౌకర్యాలకు సంబంధించి వినతులు, ప్రతిపా దనలను గాలికి వదిలేసింది. 'జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులతోపాటు ఇన్‌పేషెంట్‌లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. 150 పడకల ఆసుపత్రికి తగ్గట్టుగా వైద్యసేవలను మెరుగుపరిచాం. వైద్యాధికా రులతో పాటు వైద్య సిబ్బంది సంఖ్యను పెంచాం. రోగుల తాకిడి దృష్ట్యా అదనపు వార్డులను ఏర్పాటు చేశాం.' అని జిల్లా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శ్యామల తెలిపారు.



జిల్లా కేంద్రాసుపత్రి బయట కూర్చున్న రోగుల బంధువులు

ఒకే బెడ్‌పై ముగ్గురికి వైద్యం

సీతంపేట రూరల్: సీతంపేట ఏరియా ఆసుపత్రి లో రోజుకు 300 వరకు ఓపీ రాగా శుక్రవారం మాత్రం ఓపీ 303గా నమోదైంది. మలేరియా ఆర్‌డీటీ రక్తపరీక్షలో 21, స్లైడ్ టెస్ట్‌లో 2(ఇద్దరి)కి పాజిటివ్ వచ్చింది. ఇక టైఫాయిడ్, విష జ్వరాలతో మరో 83మంది బాధపడు తున్నారు. వీరిలో ఇన్‌పేషెంట్లుగా 31మంది ఆసుపత్రిలో చేరి వైద్యసేవలు పొందుతున్నారు. అయితే వారికి సరిపడా వార్డులు, బెడ్‌లు అందుబాటులో లేవు. దీంతో చేసేది లేక వైద్య సిబ్బంది ఒకే మంచంపై ఇద్దరు లేక ముగ్గురికి వైద్య సేవలు అందిస్తున్నారు. 100 పడకలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. పై అంతస్థులో అదనపు వార్డుల నిర్మాణ పనులు ఇంకా పూర్తికాలేదు. మొత్తంగా ఏరియా ఆసుపత్రిలో 4 వార్డు ల్లో 80బెడ్‌లు సిద్ధం చేసి రోగులకు వైద్యసేవలు అందిస్తు న్నారు. 'జ్వరపీడితుల తాకిడి ఎక్కువగా ఉంది. దానికి తగ్గ ట్టుగా రోగులకు వైద్యసేవలందిస్తుం. ఒక్కో వార్డులో 20 చొప్పున బెడ్లు వేయించాం. ఆసుపత్రి పై అంతస్థులో నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపించాం.' అని ఆసుపత్రి సూపరింటెం డెంట్ శ్రీనివాసరావు తెలిపారు.



సీతంపేట ఆసుపత్రిలో..

నిత్యం అవస్థలే...

సాలూరు: పట్టణ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం 400 వరకూ ఓపీ నమోదైంది. సుమారు 200 మంది ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. కాగా వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో రోగులకు వసతి సమస్య వేధిస్తోంది. ఒక మంచంపై ఇద్దరు నుంచి ముగ్గురు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సీహెచ్‌సీ నుంచి ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత డాక్టర్లు, వైద్య సిబ్బంది సంఖ్య పెరిగింది. సాలూరు, పరిసర గ్రామాలతో పాటు పక్కనే ఉన్న ఒడిశా నుంచి కూడా రోగులు ఇక్కడకు

(మిగతా 8వ పేజీలో...)



డ్రగ్స్ అత్యంత ప్రమాదకరం

- పోలీసు శాఖ 'సంకల్పం' కార్యక్రమంలో సినీ నటుడు సుమన్

6లో

ఆ నిబంధనలు సడలించరూ!

- ఎంతోమంది 'తల్లికి వందనం'కు దూరం
- గత ప్రభుత్వం తప్పులు సరిచేయాలని విన్నపం

6లో

కూటమి పాలనపై ప్రజల్లో ఆనందం

8లో

- ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

ప్రణాళికాబద్ధంగా చదవండి

- డీఐఈవో నాగేశ్వరరావు

8లో

పణుకువాని చెరువుకు గండి

చెరకు ఫ్యాక్టరీకి పూర్వ వైభవం వచ్చేనా?

జిల్లాలో చెప్పుకోదగ్గ వ్యవసాయాధారిత పరిశ్రమగా గుర్తింపు తెచ్చుకున్న లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం నేపథ్యం ఈ నాటిది కాదు. అర్ధశతాబ్దానికి పైగా చరిత్ర ఉంది. తొలుత ప్రైవేట్ రంగంలో ఏర్పాటై ఆ తరువాత పబ్లిక్ రంగంలోకి వెళ్లి, మళ్లీ ప్రైవేటుపరమై నేడు ఖాయిలా పడ్డ పరిశ్రమల జాబితాలో చేరింది. నాటి వైభవం కనుమరుగైంది. వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమకు కోలుకోలేని దెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం తిరిగి పరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావాలని, తెరిపించాలని రైతులు, కార్మికులు కోరుతున్నారు.

- ఎన్‌సీఎస్‌కు కొన్నాళ్లుగా అన్నీ చేదు అనుభవాలే!
- దశాబ్ద కాలం పాటు వెలుగు.. ఆపై కారుచీకట్లు
- పరిశ్రమను కూటమి ప్రభుత్వం తెరిపించాలంటున్న రైతులు, కార్మికులు

బొబ్బిలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో ఒకటి, సీతానగరం మండలం అప్పయ్యపేట గ్రామంలో మరొక చక్కెర కర్మాగారం బొబ్బిలి రాజుల ఆధీనంలో శ్రీరామ్ షుగర్స్ పేరుతో నడిచేవి. తర్వాత జరిగిన పరిణామాలతో ఈ రెండు ఫ్యాక్టరీల స్థానంలో ఒకటి వచ్చింది. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జాతీయమైన రెండు ఫ్యాక్టరీల స్థానంలో బొబ్బిలి పట్టణానికి సమీపంలో ఇప్పటి పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం లచ్చయ్యపేట వద్ద 1995-96లో ఏర్పాటైంది. సుమారు మూడువందల ఎకరాల్లో నిజాం సుగర్స్ పేరుతో రోజువారీ 2500 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ఫ్యాక్టరీని స్థాపించారు. కొన్నాళ్లు బాగానే నడిచింది. తర్వాత రోజుల్లో రైతులకు సకాలంలో చెల్లింపులు చేయలేకపోయింది. నానాటికీ బకాయిలు పెరిగిపోయాయి. ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది. 2002-03 నాటికి ఫ్యాక్టరీ నష్టాల్లో నడుస్తోందంటూ బహిరంగ వేలం వేశారు. కొనుగోలుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఎన్‌సీఎస్ సంస్థ వారు రూ.21 కోట్లకు లచ్చయ్యపేట ఫ్యాక్టరీని కొనుగోలు చేశారు. ఎన్ఎస్ఎఫ్ నుంచి ఎన్‌సీఎస్ చేతిలోకి వచ్చిన తరువాత సుమారు పదేళ్ల వరకు ఫ్యాక్టరీ ప్రగతి పథంలోనే నడిచింది. యాజమాన్యం అటు రైతులు, ఇటు కార్మికుల మన్ననలు పొందింది. ఫ్యాక్టరీని అంచెలంచెలుగా అభివృద్ధి చేసి 6500 టన్నుల క్రషింగ్ సామర్థ్యానికి పెంచడమే కాకుండా చెరకు పండించే రైతులకు ఇతోధికంగా ప్రోత్సాహకాలు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇచ్చేది. తాగునీటి పైపులైన్లు వేసింది. పలు సేవా, ధార్మిక కార్యక్రమాలను నిర్వహించేది.



చక్కెర కర్మాగారం



చెరకు పంట

తిరోగమనంలోకి ఫ్యాక్టరీ

2015 నుంచి ఫ్యాక్టరీ ప్రగతి రథం మందగమనంలో పడింది. రైతులకు, కార్మికులకు బకాయిలు పేరుకుపోవడం మొదలైంది. పీకల్లోతు కష్టాల్లో యజమాన్యం కూరుకుపోయింది. దీని నుంచి గట్టెక్కే పరిస్థితి కనుచూపుమేరలో కనిపించలేదు. ఆర్‌ఆర్ యాక్టు కింద 62.47 ఎకరాలను రూ.27.49 కోట్లకు వేలం వేసి రైతుల బకాయిలను

(మిగతా 8వ పేజీలో...)



చిలకాం - దత్తివలస రహదారి మార్గంలో పెచ్చులూడిన దృశ్యం

పెచ్చులూడి.. ప్రమాదకరంగా మారి!

- అధ్వానంగా సంతోషపురం-పాలకొండ రోడ్డు
- వాహనదారులకు తప్పని అవస్థలు

గరుగుబిల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం ఖడ్గవలస సముదాయం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి మార్గం ప్రమాదకరంగా మారింది. బీటీ రహదారిపై పెచ్చులూడిపోతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడే గోతులు ఏర్పడడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. వాస్తవంగా ఖడ్గవలస నుంచి ఉల్లిభద్ర వరకు ప్రధాన రహదారి మెరుగుపర్చేందుకు కూటమి ప్రభుత్వం సుమారు రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఖడ్గవలస నుంచి అడ్డాపుశీల వరకు మాత్రమే మరమ్మతు పనులు పూర్తయ్యాయి. సంతోషపురం నుంచి పాలకొండ వరకు రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో ఇటువైపుగా ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇదిలా ఉండగా రావివలస సమీపంలో గతంలో ఏర్పాటు చేసిన ప్రధాన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. కారివలస సమీపంలో కుడి పిల్ల కాలువపై నిర్మించిన కల్వర్టు కుంగి పోయేందుకు సిద్ధంగా ఉంది. శ్రీకాకుళంతో పాటు ఒడిశాకు ప్రధానమైన ఈ రోడ్డుపై సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ వాసిరెడ్డి రామ్‌మోహనరావును వివరణ కోరగా.. 'ఖడ్గవలస నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన మార్గంలో బీటీ రహదారిపై గుంతలు పూడ్చుతాం. దీనిపై కాంట్రాక్టర్‌కు సమాచారం అందించాం. రహదారిపై పెచ్చులు ఊడిపోకుండా చర్యలు చేపడతాం. ప్రధాన కల్వర్టుల పనులకు ప్రతిపాద నలు పంపించాం. కల్వర్టుల ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకల నియంత్రణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.' అని తెలిపారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

8లో

- ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

6లో

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మన్యం అభివృద్ధికి సహకరిస్తాం

- ప్రత్యేక అవసరాలపై నివేదికలివ్వండి
- నిధుల మంజూరుకు కృషి
- కేంద్ర మంత్రి ఇంద్రజిత్‌సింగ్
- కలెక్టర్లతో సమీక్ష



కేంద్ర మంత్రిని సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యేలు విజయచంద్ర, జయకృష్ణ

పార్వతీపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆశావహ జిల్లాల (ఏస్పిరేషన్ డిస్ట్రిక్ట్సు) జాబితాలో ఉన్న పార్వతీపురం మన్యం అభివృద్ధికి పూర్తిగా సహకరి స్తామని, కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కేంద్ర ప్రణాళిక, సాంస్కృతిక శాఖల సహాయ మంత్రి ఇంద్రజిత్ సింగ్ భరోసా ఇచ్చారు. ప్రత్యేక అభివృద్ధి అవసరాలపై నివేదిక అందజేస్తే కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు. శుక్రవారం విశాఖపట్నం కలెక్టరేట్‌లో పలు జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. అంతకముందు ఆశావహ జిల్లాలు వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు దినేష్‌కుమార్, శ్యామ్‌ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్య, ఆరోగ్య, వ్యవసాయ, మౌలిక వసతులు, ఆర్థిక అభివృద్ధి తదితర 49 అంశాల్లో సాధించిన పురోగతి, నీతి అయోగ్ నిధుల వినియోగాన్ని తెలియజేశారు. జిల్లాల ప్రత్యేక అవసరాలు, అభివృద్ధిలో నిధులు పరంగా ఎదురవుతున్న ఇబ్బందులను కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. మన్యం జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో వెనుకబడి ఉందని, సూక్ష్మ స్థాయి మినహా మధ్య, భారీ పరిశ్రమలు ఏవీ లేవని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వెల్లడించారు. ఐటీఐలు, సాంకేతిక, ఉన్నత విద్యా సంస్థలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నా మన్నారు. జిల్లాలో కేవలం 15 కిలోమీటర్ల మాత్రమే జాతీయరహదారు లున్నాయని తెలిపారు. కొన్ని రాష్ట్ర రహదారులను హైవేలుగా మార్చు చేయాలన్నారు. పార్వతీపురంలో మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, పర్యాటక ప్రాజెక్టులకు నిధులు మంజూరుచేయాలని కోరారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

(మిగతా 8వ పేజీలో...)

డ్రగ్స్ అత్యంత ప్రమాదకరం

- వాటికి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు
- భారత్ ఔన్నత్యాన్ని ఓర్వలేక విదేశీయులు డ్రగ్స్‌తో కుట్ర
- డ్రగ్స్ రహిత సింగపూర్‌లా మన దేశంలో విధానాలు ఉండాలి
- పోలీసు శాఖ 'సంకల్పం' కార్యక్రమంలో సినీ నటుడు సుమన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న హీరో సుమన్

బొబ్బిలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ అత్యంత ప్రమాదకరమని, వాటిజోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ప్రముఖ సినీ నటుడు సుమన్ పిలుపునిచ్చారు. భారతదేశాన్ని నాశనం చేయాలని కొంతమంది విదేశీయులు డ్రగ్స్‌తో కుట్ర పన్నుతున్నారని, యువత దీన్ని గుర్తించాలని కోరారు. స్థానిక టీబీఆర్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమానికి సుమన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన వ్యక్తిగత జీవితంతో పాటు సినీజీవితాన్ని కూలంకుషంగా వివరించారు. ఆయన మాటల్లో..

'మా అమ్మ లెక్చరర్ నుంచి ప్రిన్సిపాల్ అయింది. మా నాన్న కార్పొరేషన్‌లో చిరుద్యోగి నుంచి ఉన్నత ఉద్యోగానికి వెళ్లారు. మా అమ్మ దగ్గర ప్రముఖ సినీ హీరోలు కృష్ణ, శోభన్‌బాబు పిల్లలు చదువుకున్నారు. నేను ముస్లింలు, క్రిష్టియన్లు, సిక్కులు నివసించే ప్రాంతంలో కలిసి మెలిసి పెరిగాను. 47 సంవత్సరాల పాటు వందలాది సినిమాల్లో నటించాను. తల్లిదండ్రులు, గురువులే, రైతులు, దేశసైనికులు, పోలీసులను గౌరవించుకోవాలి. గిరిజనులకు ఉచితంగా కరాటే నేర్పించాను. ఒకానొక దశలో నేను ఆల్కహాల్‌కు బానిసనయ్యాను. ఆ తరువాత బయటపడగలిగాను. అందరూ అత్యంత ప్రమాదకరమైన డ్రగ్స్ జోలికి పోకుండా అప్రమత్తంగా ఉండాలి. డ్రగ్స్‌కు బానిసైన వారి తోబుట్టువులకు పెళ్లిళ్లు కావడం చాలా కష్టం. సింగపూర్‌లో డ్రగ్స్ మత్తుపదార్థాలకు సంబంధించి కఠినమైన విధానాలు అమలులో ఉన్నాయి. అవి మనదేశంలో కూడా రావాలి' అన్నారు.

డ్రగ్స్ భరతం పట్టేందుకు 300 డైనమిక్ చెక్‌పోస్టులు..

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను పూర్తిగా పారదోలడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ఒడిశా సరిహద్దు ప్రాంతంలో 29 చెక్‌పోస్టులతో పాటు మరో 300 డైనమిక్ చెక్‌పోస్టులను పెడుతున్నాము. గంజాయి పండించే రైతుల్లో అవగాహన కల్పించి 11 వేల ఎకరాలల్లో 45 ప్రత్యామ్నాయ పంటలను పండిస్తున్నాం. గంజాయి పండించినా, అమ్మినా, సేవించినా, రవాణా చేసినా నేరమే. రెండువేల మంది నిందితులను అరెస్టు చేసి, 450 వాహనాలను సీజ్ చేశాం. వీరిలో 800 మంది ఇతర రాష్ట్రాల వారే. ఇంకా 1700 మందిని అరెస్టు చేయాల్సి ఉంది. 2021-22 లో అల్లూరి జిల్లా పరిధిలోని 11 మండలాల్లో 7,550 ఎకరాల్లో గంజాయి పండించేవారు. నేడు అది 93.5 ఎకరాలకు పడిపోయింది. ఆ పంటలను కూడా నాశనం చేశాము. పదిమంది గంజాయి స్మగ్లర్లకు సంబంధించి రూ.11 కోట్ల ఆస్తులు సీజ్ చేశాం. 78 మందిపై క్రిమినల్‌కేసులు పెట్టాము. రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నాము' అని డీఐజీ అన్నారు.

- ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ 'మత్తుకు బానిసలైన యువత జీవితాలను చూసి చాలా వేదనకు గురవుతున్నాం. దీనిని అరికట్టేందుకు విద్యాసంస్థలు, కూడళ్లలో ఫిర్యాదుబాక్స్‌లు పెట్టేందుకు పోలీసుశాఖకు సహకరిస్తాం. పోలీసులు నిందితులను పట్టుకుంటే ఎమ్మెల్యే హోదాలో రాజకీయంగా జోక్యం చేసుకునే ప్రసక్తే లేదు' అన్నారు.
- ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ 'హత్యా నేరం కింద అరెస్టు అయ్యే వారికన్నా గంజాయి నిందితులకు కఠిన శిక్షలు పడతాయి. 20 ఏళ్ల వరకు జైలు శిక్ష ఉంటుంది. సరదా కోసం చేసుకునే అలవాటు జీవితాలను సర్వనాశనం చేస్తుంది. పోలీసు రికార్డులు ఎక్కిన వారికి భవిష్యత్‌లో ఉద్యోగం రావడం కష్టం. డ్రగ్స్‌ను పూర్తిగా అరికట్టేందుకు టోల్‌ఫ్రీ నెంబర్లు, యాప్‌లు వినియోగించుకోవాలి. పోలీసులకు సహకరించాలి' అని కోరారు.
- బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాకర్ల గాంధీ జానపద గేయంతో అవగాహన కల్పించారు. పద్మాలయ నృత్యసంస్థ గుండెపు పద్మజ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. కరుణ్‌కుమార్, మింది విజయమోహన్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కుపై మైమ్ షో ఇతర ప్రదర్శనలిచ్చారు.



ప్రతిజ్ఞ చేస్తున్న డీఐజీ గోపీనాథ్‌జెట్టి, నటుడు సుమన్, ఎమ్మెల్యే బేబీనాయన, ఎస్పీ వకుల్ జిందాల్

బొబ్బిలి వీణల బహూకరణ..

హీరో సుమన్‌కు, పోలీసు ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే బేబీనాయన బొబ్బిలి వీణలను బహూకరించారు. కార్యక్రమంలో సీఐలు కటకం సతీష్‌కుమార్, నారాయణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, గెంబలి శ్రీనివాసరావు, డాక్టర్ చింతా శారద, జేసీ రాజు, గోనా మానస తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఏడాది సుపరిపాలనపై వీడియో ప్రదర్శన

విజయనగరం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించే లక్ష్యంతోనే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం కోట జంక్షన్‌లో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు కోట జంక్షన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి, ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు వైరిచర్ల వీరేష్ తదితరులు పూలమాల వేశారు. అనంతరం ఏడాది కాలంలో విజయనగరం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడాదిలో అన్ని రంగాల్లో రాష్ట్రం ముందుకు వెళ్లిందన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధి తిరోగమనంలో నడిచిందన్నారు. తమ ప్రభుత్వం హయాంలో పింఛన్ల పెంపు, తల్లికి వందనం కింద ఆర్థిక సాయం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు. ఆగస్టు నెలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అలాగే అన్నదాత సుఖీభవ కింద ఆర్థిక సాయం అందుతుందన్నారు. వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత కూటమి శ్రేణులపై ఉందన్నారు.

- ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ ఏడాది కాలంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు వీరేష్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేసే ప్రభుత్వంగా పేరు తెచ్చుంటామన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ నిబంధనలు సడలించరూ!

- ఎంతోమంది 'తల్లికి వందనం'కు దూరం
- గత ప్రభుత్వం తప్పులు సరిచేయాలని విన్నపం
- షరతుల్లేని సంక్షేమం అందించాలని వేడుకోలు



రాజాం రూరల్, జులై 18(ఆంధ్రజ్యోతి)

- బొబ్బిలికి చెందిన శ్రీపతి రాంబాబు డాక్యుమెంట్ రైటర్ వద్ద గుమస్తాగా పనిచేస్తున్నారు. ఇతనికి ఇద్దరు పిల్లలు. రాంబాబు, అతని తల్లి వేర్వేరుగా ఉంటున్నారు. ఆ ఇద్దరు పిల్లలకూ 'తల్లికి వందనం' వర్తించలేదు. సచివాలయానికి వెళ్తే రాంబాబు, అతని తల్లి ఇంటి నెంబర్లు ఒకటిగా నమోదై ఉండడంతో పథకం వర్తించలేదని సచివాలయ సిబ్బంది చెప్పినట్లు రాంబాబు తెలిపారు.
- తెర్లాం మండలం ఎన్.బూర్జవలసకు చెందిన గుమ్మడి రాముకి తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి ఉంది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం జాబితాలో రాము కుమార్తె పేరు లేదు. ఇదేమని ప్రశ్నిస్తే.. ఏడాదిలో ఓనెలలో 300 యూనిట్లు విద్యుత్ వినియోగించడంతో పథకం వర్తించలేదన్నది కారణం.
- ఇదే గ్రామానికి చెందిన తాడివలస పోలిశెట్టికి కేవలం ఎకరా పల్లం భూమి ఉంది. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదం వల్ల నాలుగెకరాల పల్లం భూమి ఉన్నట్లు రికార్డుల్లో కనిపిస్తోంది. దీంతో ఇతని కుటుంబానికి కూడా తల్లికి వందనం పథకం వర్తిం చలేదు. ఈ సమస్య రాంబాబుదో, రాముదో, పోలి శెట్టిదో మాత్రమే కాదు. ఇలాంటి చిన్నపాటి సాంకేతిక సమస్యల వల్ల చాలామంది తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు.

ఆర్థికంగా వెనుకబడి ఉన్నా ప్రభుత్వం అందించే సంక్షేమానికి దూరమయ్యారు

గత వైసీపీ ప్రభుత్వంలో..

నిబంధనలకు మించి ఆస్తి ఉందని, విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని, కుటుంబంలో ఉద్యోగులున్నారని, ఎప్పుడో ఐటీలు దాఖలు చేశారని, ఎక్కువ భూములుండేవని, జేసీబీ ఉన్నట్లు రికార్డుల్లో కనబడుతోందనన్న కారణాలతో చాలామంది సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఉండేందుకు ఇల్లు లేకపోయినా, పరిమితికి మించి భూమి లేకపోయినా తప్పుడు వివరాల నమోదుల వల్ల పేదలకు సైతం పథకం వర్తించలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపుగా ఇదే విధానం కొనసాగింది. ఆరంచెల వడపోతతో చాలామంది అప్పట్లో నష్టపోయారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఇప్పుడు కూడా కొన్నిచోట్ల వడపోత, ఏరివేత కార్యక్రమం కొనసాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం నవరత్నాల పేరుతో హడావుడి చేసి ఆ తరువాత సంక్షేమ పథకాల భారాన్ని తగ్గించుకునేందుకు ఎన్నో యుక్తులు ప్రదర్శించింది. ఫలితంగా ప్రజాగ్రహానికి గురికావాల్సిన పరిస్థితి ఎదురైంది. కూటమి ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

షరతులు లేని సంక్షేమాన్ని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చాలామంది పింఛన్లు, అమ్మఒడి పథకాలు కోల్పోయినవారే. వారంతా కూటమి ప్రభుత్వంలో మేలు జరుగుతుందని, గత ప్రభుత్వ తప్పులను సరిచేస్తుందని, పథకాలు అందుతాయని ఆశతో ఉన్నారు. త్వరలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కానున్న నేపథ్యంలో తమకు న్యాయం జరిగేలా నిబంధనలు సడలించాలని వారు కోరుతున్నారు.



శాకంబరిగా గాయత్రీదేవి

రాజాం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రీ కాలనీలో గల గాయత్రీ మాత శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా భక్తులు సమర్పిం చిన పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరించారు.

'అక్షరాంధ్ర'తో శతశాతం అక్షరాస్యత

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



విజయనగరం కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్‌లో భాగంగా చేపట్టిన అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలో శతశాతం అక్షరాస్యతను సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. అక్షరాంధ్ర కార్యక్రమంపై కలెక్టర్ తన చాంబర్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ వేతనదారులు, వెలుగు, మెప్మా మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ ఆయాలు.. ఆయా శాఖల ద్వారా లబ్ధి పొందుతున్న గర్భిణులు, మహిళలు, బాలికల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులను చేయాలని సూచించారు. ఈనెల 26లోగా జాబితాను రూపొందించాలన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఎంపీడీవో ఆధ్వర్యంలోని సీడీపీవోలు, ఏపీవోలు, ఎంఈవోలు ఈనెల 26లోగా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. వలంటీర్ల ఎంపిక పూర్తి చేసి వారికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలను వలంటీర్లుగా నియమించాలని సూచించారు. ఈ సమావేశంలో వయోజన విద్యా డిప్యూటీ డైరక్టర్ సుబ్రమణ్యావర్మ, జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ సావిత్రి, డ్వామా పీడీ శారదాదేవి, డీఈవో మాణిక్యం నాయుడు, ఐసీడీఎస్ పీడీ విమలరాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సంఘ నాయకులు

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- డీఎస్సీ-2003 ఉపాధ్యాయ ఫోరం నాయకుల డిమాండ్

విజయనగరం కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా డీఎస్సీ-2003 టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్ సూర రవికుమార్ మాట్లాడారు. దేశంలోని 16 రాష్ట్రాలు, ఆయా రాష్ట్రాల్లో 2004 సెప్టెంబరు మొదటి తేదీకి ముందు నోటిఫై అయిన పోస్టులకు మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల మంది ఉద్యోగులకు మెమో 57ను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కాశీవిశ్వనాథం, నారాయణరావు, సింహాచలం, చక్రధర్, యూటీఎఫ్ నుంచి ఈశ్వరరావు, విజయగౌరి, శ్రీనివాసరావు, జోగినాయుడు, శ్యామ్, రామారావు ఉన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

మహిళలకు రక్షణగా శక్తి మొబైల్ యాప్

- మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణగా శక్తి మొబైల్ యాప్ అందుబాటులో ఉందని, ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆర్ గోవిందరావు అన్నారు. నగరంలోని సెంటాన్స్ గర్ల్స్ స్కూల్ విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు మొబైల్ ఫోన్లలో శక్తి యాప్ నిక్షిప్తం అయిఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందన్నారు. ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడుగా ఉన్నట్లేనన్నారు. శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్‌ను ప్రెస్ చేసినట్టయితే వెంటనే పోలీసు బృందం మీరున్న ప్రాంతానికి చేరుకుంటుందని వివరించారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని, అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని అన్నారు. చదువుకునే సమయంలో ఇతరుల పట్ల ఆకర్షితులు కావద్దని, వారు చెప్పే మాయ మాటలు నమ్మి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి గురించి సమాచారం తెలిస్తే డయల్ 100/112 లేదా 1972కు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శిరీషా, శక్తి బృందం పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ఆషాఢం సారె

భోగాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగాపురం వాటర్ ట్యాంకు ఏరియాలో కొలువుతీరిన కనక దుర్గమ్మతల్లికి పలువురు భక్తులు శుక్రవారం ఆషాఢం సారె సమర్పించారు. వేద పండితుడు బి.సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో సామూహిక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని స్వీట్లు, పండ్లు, చీరలు పెట్టి పూజలు చేశారు.

- విజయనగరం టౌన్: నగరంలోని నాగోజీపేట మయూరి జంక్షన్ వద్ద కొలువుతీరిన కనకదుర్గమ్మ వారికి ఆలయ నిర్వాహకులు ఆషాఢం సారె సమర్పించారు. సిడగం రమణ, కుమారి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆషాఢం సారె ఉంచి సామూహిక వ్రత పూజలు చేస్తున్న దృశ్యం

ఎంఆర్‌హెచ్ రైతులు తాత్కాలికంగా తరలింపు

విజయనగరం కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌హెచ్ రైతు బజారులో ఉన్న రైతులను తాత్కాలికంగా రింగురోడ్డు రైతుబజారు పరిధిలో ఖాళీగా ఉన్న ప్రాంగణానికి తరలిస్తున్నామని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సౌకర్యార్థం తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తాత్కాలిక షెడ్ల నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్న కారణంగా వీరిని తరలిస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న దామోదరరావు

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

విజయనగరం రింగురోడ్డు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ (పీటీడీ) ఉద్యోగులకు గత ఆరేళ్లుగా పెండింగ్ పెట్టిన పదోన్నతలకు ప్రభుత్వం వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. విజయనగరంలో శుక్రవారం నిర్వహించిన ఆర్టీసీ ఈయూ జిల్లా కార్యవర్గ సమావేశం లో అయన పాల్గొని, మాట్లాడారు. ఆగస్టు 15 నుంచి ప్రవేశపెట్టనున్న మహిళలకు ఉచిత బస్సు పథకం విజయవంతం కావాలంటే వెంటనే 3వేల బస్సులను కొనుగోలు చేయాలన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. అలాగే ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన 11వ పీఆర్సీ 24 నెలలు బకాయిలు, డీఏ బకాయిలతోపాటు 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రస్తుతం ఈహెచ్ఎస్ ద్వారా కనీస వైద్య సదుపాయాలు కూడా అందడం లేదన్నారు. వెంటనే పరిష్కరించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'
● పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యేలు


పూసపాటిరేగ: ప్రచారం చేస్తున్న బంగార్రాజు


చీపురుపల్లి: కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కళా


ఎల్.కోట: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యేలు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలువురు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించి, పథకాలపై వివరించారు.

● పూసపాటిరేగ, జూలై 18(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. వెల్దూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి దంగా భూలోక, సర్పంచ్ సత్యవతి, చందక ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

● చీపురుపల్లి, జులై 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. రామలింగపురంలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రభుత్వ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

● లక్కవరపుకోట, జూలై 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని దాసుల్లుపాలెం, గంగుబూడి గ్రామాల్లో శుక్రవారం ఆమె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె దాసుల్లుపాలెంలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, మాజీ జడ్పీటీసీ కొరెడ్ల ఈశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, కొట్యాడ ఈశ్వరరావు, సర్పంచ్ భూపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

గంట్యాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి ఆదేశించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు రికార్డులకు తగిన విధంగా ఉన్నాయా.. అనేదానిపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, వ్యవసాయ శాఖ ఏవో శ్యామ్‌కుమార్ తదితరులు ఉన్నారు. ● దత్తిరాజేరు: పెదమానాపురం సంతతోటలో ఉన్న ఎరువుల దుకాణాన్ని ఆర్డీవో రామ్మోహనరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డులు పరిశీలించారు. ఎరువులు ఎంఆర్‌పీ ధరకు విక్రయించాలన్నారు. అన్ని ఎరువులను అందుబాటులో ఉంచాలని, బిల్లులు తప్పనిసరిగా అందించాలని సూచించారు. అనంతరం గోదాంను తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ పి.విజయభాస్కర్, మండల వ్యవసాయాధికారిణి అనూరాధ తదితరులు ఉన్నారు. ● గరివిడి: గరివిడి మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తహసీల్దార్ బంగార్రాజు, ఏవో శైలజలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎరువుల దుకాణాల రికార్డులను పరిశీలించారు. ఎంఆర్ పీకే ఎరువులను విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని సూచించారు. అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


దత్తిరాజేరు: ఎరువుల నిల్వను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు


గంట్యాడ: ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఆర్డీవో కీర్తి

విజిలెన్స్ తనిఖీలు

నెల్లిమర్ల: నెల్లిమర్లలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీనివాస ట్రేడర్స్ దుకాణాన్ని తనిఖీ చేసి, నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ టి.అప్పలనాయుడు, పలాస వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.రామారావు, ఏవో పి.శ్రీలక్ష్మి, వ్యవసాయ విస్తరణాధికారులు పి.కూర్మారావు, ఎం.నాగరాజు, బి.రమేష్ పాల్గొన్నారు.

ఎవ్వరికీ అన్యాయం జరగనివ్వం

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత

విజయనగరం కలెక్టరేట్/ శృంగవరపుకోట, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిందాల్ అల్యూమినియం కంపెనీని ఎస్.కోట మండలంలో ఏర్పాటు చేయడానికి 2007లో ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, దీని ప్రకారం 2008లో భూముల సేకరణ జరిగిందని రాష్ట్ర హోం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 834.66 ఎకరాల అసైన్మెంట్ భూమి, 151.04 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారని చెప్పారు. అసైన్మెంట్ భూమికి నష్టపరిహారం ఎకరానికి రూ.2లక్షల 500 చొప్పున చెల్లించారని తెలిపారు. డీపట్టాలు కలిగిన 375 మంది అసైన్మెంటుదారుల్లో 352 మందికి నష్టపరిహారంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా మంజూరు చేశామని చెప్పారు. మిగిలిన 43మందిలో 15 మంది అర్హత కలిగిన డీపట్టాదారులకు ఇటీవల కాలంలో గుర్తించి వారిలో ముగ్గురికి నష్టపరిహారం అందజేశామని ఆమె తెలిపారు. ఎవరికీ అన్యాయం జరగనివ్వబోమని ఆమె స్పష్టం చేశారు.

విద్యతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం రెడ్డికంచేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో థెరిస్సా క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆమె సైకిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో థెరిస్సా క్లబ్ ప్రతినిధులు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వందనాల రమణ, నాయకులు పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

● పూసపాటిరేగ ఏఎంసీ చైర్మన్‌గా నియమితులపైన గేదెల గాయత్రి ముంజేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నాగమాధవిని కలిశారు. ఈసందర్భంగా ఆమెకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

● అమటాం రాయవలస గ్రామంలో ఎమ్మెల్యే నాగమాధవి శుక్రవారం పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.


సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

సమస్యల పరిష్కారానికి కృషి

భోగాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి వచ్చిన వినతుల పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలోని తన స్వగృహంలో ఆయన 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం నిర్వహించి అర్జీదారుల నుంచి వినతులు సేకరించారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖ నార్త్ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, టీడీపీ నెల్లిమర్ల మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పార్లమెంటు అధికార ప్రతినిధి గేదెల రాజారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలి

● తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి రామ్‌భూపాల్

నెల్లిమర్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని తెలంగాణా పీసీసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ రామ్‌భూపాల్ అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల వ్యక్తిగత పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం రామతీర్థంలోని రామచంద్రస్వామి ఆలయాన్ని దర్శించుకుని స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆయనకు రామతీర్థం మాజీ సర్పంచ్ కంచరాపు రాము, ఉప సర్పంచ్ లంక రామునాయుడు, ఉపాధ్యాయుడు తిరుమలరెడ్డి శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది దుస్సాలువతో సత్కరించి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారంతా ఒక్కటిగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. స్వామివారి అనుగ్రహంతో ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.


రామతీర్థం దేవస్థానంలో రామ్‌భూపాల్

ఖరీఫ్ సాగుపై రైతులకు శిక్షణ

మెరకముడిదాం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలావేరు, ఊట్లపల్లి గ్రామాల్లో రైతులకు ఖరీఫ్ పంటల సాగు, ఇతర అంశాల పట్ల వ్యవసాయ అధికారులు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పీఎం ఆర్‌కేఈవై పథకంలో భాగంగా జిల్లా శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ పూడి నిర్మల, మండల వ్యవసాయాధికారి శ్రావణితేజ వరి పంటల సమగ్ర సస్యరక్షణపై రైతులకు వివరించారు. వరి పంట సాగుచేసే రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. వరికి ఎవరాకు రూ.200 చొప్పున వచ్చేనెల 15వ తేదీ లోపు చెల్లించాలని చెప్పారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో గోవిందమ్మ.. ఖరీఫ్ పంటలకు సోకే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వీఏఏలు పాల్గొన్నారు.

సంపత్ వినాయకుని దర్శించుకున్న సుమన్

విజయనగరం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేటలో ఉన్న సంపత్ వినాయకుని సినీ నటుడు సుమన్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ యడ్ల పైడిరాజు, కమిటీ మెంబరు సుమన్ శ్రీనివాస్‌లతో పాటు కమిటీ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై సుమన్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం పురోహితులు సుమన్‌తో ప్రత్యేక పూజలు చేయించారు. ఇదే కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విజయనగరం డీఎస్పీ డి.శ్రీనివాస్ దంపతులు హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగీరీజు వీధిలో సుమన్ శ్రీనివాస్‌తో పాటు, పలువురు ఏర్పాటు చేసిన ఎడ్యుకేషనల్ ట్రస్టుని సుమన్ శుక్రవారం రాత్రి ప్రారంభించారు.


సుమన్‌ను స్వాగతిస్తున్న అర్చకులు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి

రాజాం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇసుకను ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిపోతున్నా పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాగావళి నదిలో రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి సోర్సు బావులు ఉన్నప్పటికీ ఆ బావులకు ఆనుకుని ఇసుక తవ్వకాలు చేసి, అక్రమంగా తరలిస్తున్నారని విమర్శించారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు ప్రజలకు తక్కువ ధరకు అందించేలా చూడాలని ఆయన కోరారు.

రైతుల సంక్షేమంపై దృష్టి పెట్టండి

చీపురుపల్లి/రాజాం, జులై 18 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన మార్కెట్ కమిటీ చైర్మన్లు తమ పరిధిలోని రైతుల సంక్షేమంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు హితవు పలికారు. చీపురుపల్లి, బైరిపురం ఏఎంసీ చైర్మన్లుగా నియమితులైన రేగాన రామారావు, తాడ్డి చంద్రశేఖర్‌లు శుక్రవారం రాజాంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన వారిని అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం నాయకులు దన్నాన రామచంద్రుడు, విసినిగిరి శ్రీనివాసరావు, పారేపాక సురేష్, పైల బలరాం, రమేష్, చల్లా శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

● భోగాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి గ్రామంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజును పూసపాటిరేగ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన గేదెల గాయత్రి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ని సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, కడగల ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజుకు సత్కారం

నెల్లిమర్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన గేదెల గాయత్రి తన భర్త గేదెల రాజారావుతో కలిసి శుక్రవారం విజయనగరంలోని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్ ఉన్నారు. ఈసందర్భంగా ఆయనను సత్కరించారు. తమకు ఏఎంసీ చైర్‌పర్సన్ పదవి లభించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.


నెల్లిమర్ల: అశోక్ గజపతిరాజును సత్కరిస్తున్న దృశ్యం

పాలకుల తీరు సరికాదు

● జిందాల్ నిర్వాసితుల ఆందోళన

శృంగవరపుకోట రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ యాజమాన్యం కోసం పాలకులు పాకిస్తాన్ తరహా పాలన ఇక్కడ అమలు చేస్తున్నారని సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ ఆరోపించారు. శుక్రవారం ఆయన బొడ్డవర గ్రామంలో నిర్వాసితులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిందాల్ కంపెనీ ఏర్పాటు సమయంలో అప్పటి కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాప్రాయ సేకరణలో భూములు ఇచ్చిన వారికి ఎన్నో హామీలు ఇచ్చారని, వాటిని మినిట్స్ రాసి అమలు చేస్తారని అప్పట్లో ప్రకటించారన్నారు. అయితే 18 ఏళ్లుగా కంపెనీ పెట్టకుండా నిర్వాసితులను మోసం చేస్తున్నారని అన్నారు. గత 26 రోజులుగా అహింసా మార్గంలో న్యాయం కోరుతుంటే పోలీసులు వారిపై బైండోవర్లు నమోదు చేయడం తగదన్నారు.



నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

వేతనాలు లేక అవస్థలు

గజపతినగరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

దోమల నివారణకు చర్యలు

శృంగవరపుకోట రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు జిల్లా మలేరియా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చెరువుల్లో గంబూషియా చేపలను విడిచిపెట్టారు. ఈసందర్భంగా కొట్టాం పీహెచ్‌సీ వైద్యురాలు లావణ్య మాట్లాడుతూ ఈ చేపలు దోమలు పెట్టే గుడ్లను తింటాయని తెలిపారు. సీహెచ్‌వో వేణుగోపాలరావు పాల్గొన్నారు.

మహిళల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

చీపురుపల్లి, జులై 18(ఆంధ్రజ్యోతి): మహిళ రక్షణ పట్ల మహిళా పోలీసులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. మండలంలోని వివిధ సచివాలయాలకు బదిలీపై వచ్చిన మహిళా పోలీసులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు జరగకుండా చూడాలని సూచించారు. ఎస్ఐ ఎల్.దామోదరరావు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

చీపురుపల్లి, జులై 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. రూ.5లక్షల 68వేల 550 విలువ గల చెక్కులను పలు గ్రామాలకు చెందిన బాధితులకు ఆయన అందజేశారు. టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, దన్నాన రామచంద్రుడు, ఇప్పిలి సురేష్, వర్మరాజు, ఆరతి సాహు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం

నెల్లిమర్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): కొండవెలగాడలో నాయీబ్రాహ్మణ కుటుంబానికి చెందిన రాములమ్మ అనే పేద మహిళ మృతి చెందడంతో ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దంతులూరి అజయ్‌బాబు శుక్రవారం ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

రాజాం రూరల్, జులై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో శుక్రవారం రాత్రి ఓ దాబాలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.1420 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

మద్యం సీసాల స్వాధీనం

రాజాం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పొగిరి గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో 45 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన బత్తుల జనార్దన్ నుంచి 23 సీసాలు, గెంబలి సత్యనారాయణ నుంచి 22 సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసులు నమోదు చేశామని తెలిపారు.

హామీలు అమలు చేయాలి

గుర్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక కల్యాణమండంలో నిర్వహించిన వైసీపీ మండల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గడపగడపకు తీసుకు వెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు రాజాం రచయితల వేదిక సమావేశం

రాజాం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 126వ సమావేశం ఈనెల 20న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని వేదిక కోకన్వీనర్ పిల్లా తిరుపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజాం పరిసర ప్రాంతాల్లో ఉన్న సాహిత్య అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

తాగునీటి పరిశీలనకు శాంపిల్స్ పంపండి

రాజాం, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యలు నెలకొన్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు శాంపిల్స్ తీసి పంపించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన కొఠారపురం గ్రామంలో ఇంటింటికి చెత్త సేకరణను పరిశీలించి, తాగునీటి బోర్లను కూడా పరిశీలించారు. శాంపిల్స్ తీసి పీఆర్ ఒన్ యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. మండలంలో 10 పంచాయతీలను ఐవీఆర్ఎస్ గ్రామాలుగా గుర్తించినట్లు తెలిపారు.

గ్రామ సమృద్ధి స్థాపక ప్రణాళికపై శిక్షణ

జామి, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రామ సమృద్ధి స్థాపక ప్రణాళిక అమలుపై శుక్రవారం స్థానిక మండల వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో వీపీఆర్‌పీ, ఈసీ సభ్యులు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో అప్పలనాయుడు మాట్లాడారు. లైవ్‌లీహుడ్ ప్లాన్, ఫామ్ లైవ్‌లీహుడ్ ప్లాన్, నాన్‌ఫామ్ ప్లాన్ వంటి వాటిపై శిక్షణ ద్వారా అవగాహన కల్పించామన్నారు. ఈ ప్రణాళికలపై శిక్షణ అనంతరం గ్రామసభల ద్వారా ప్రజలకు వివరించి.. ఆమోదం తీసుకుని అమలు చేస్తామని తెలిపారు.

తెలంగాణలో రోడ్డు ప్రమాదం

● కారులో ప్రయాణిస్తున్న ఐదుగురి మృతి
● మృతుల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లా వాసులు


కృష్ణ (ఫైల్)

ఆదిభట్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఐదుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ఇద్దరు ఉన్నారు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధి బొంగులూరు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దాసరి తండాకు చెందిన గుగులోత్ జనార్దన్ (45), వరంగల్ జిల్లా పాకాలకు చెందిన మాలోత్ చందులాల్(29), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా వేదులవలస గ్రామానికి దాసరి భాస్కర్‌రావు (39), విజయనగరం జిల్లా తెర్లాం మండలం కల్మరాజుపేట గ్రామానికి చెందిన జాడ కృష్ణ(25) కొంతకాలంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రీన్‌వ్యాలీ రిసార్టులో పనిచేస్తున్నారు. పరిచయస్తుడైన ఎన్కేపల్లికి చెందిన కావలి బాల్‌రాజ్ (40) కారులో గురువారం రాత్రి 9గంటలకు యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా ఘట్కేసర్ వద్ద అదే రాత్రి 2.45 గంటలకు ఔటర్ రింగు రోడ్డుపైకి వచ్చారు. మూడు గంటలప్పుడు బొంగులూరు ఎగ్జిట్ 12 సమీపంలోని మైల్‌స్టోన్ 101 వద్ద వీరి కారు ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న జనార్దన్, చందులాల్, భాస్కర్‌రావు, బాల్‌రాజ్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కృష్ణ తీవ్రంగా గాయపడడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. రాచకొండ కమిషనరేట్ పరిధి మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

దత్తిరాజేరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగర పంచాయతీ ముద్దానపేట గ్రామంలో పురుగు మందు తాగి ఒకరు మృతిచెందారు. పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దానపేట గ్రామానికి చెందిన ముద్దాన అప్పన్న(38) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయంలో ఆర్థికంగా నష్టపోయాడు. అప్పుల బాధ తాళలేక ఈనెల 14న ఇంటి ముందున్న పొలంలో పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న భార్య, పిల్లలు వెంటనే గజపతినగరం సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బావిలో పడి ఒకరు..

రాజాం రూరల్, జులై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరిజన వీధికి చెందిన రేజేటి సోమయ్య(54) నేలబావిలో పడి మృతి చెందినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 17న మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన సోమయ్య శుక్రవారం వరకూ రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. దీంతో హరిజనవీధి సమీపంలోని నేలబావిలో సోమయ్య మృతదేహం తేలిఉండడాన్ని శుక్రవారం గుర్తించారు. ఈ మేరకు మృతుడి భార్య సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

గుర్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ నారాయణ శుక్రవారం తెలిపారు. తనను ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకోవాలని బెదిరిస్తున్నాడని బాలిక ఫిర్యాదులో పేర్కొంది. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించామని ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

కొండవెలగాడలో అక్రమాలపై విచారణ

నెల్లిమర్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడ పంచాయతీలో 2013-14 మధ్య కాలంలో జరిగిన నిధుల వినియోగం తీరుపై విజయనగరం డివిజనల్ పంచాయతీ అధికారి శిరీష శుక్రవారం విచారణ ప్రారంభించారు. ఆ గ్రామానికి చెందిన చల్లా రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె ఈ విచారణ చేపట్టారు. పంచాయతీ నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు పెట్టారని, ప్రభుత్వ నిబంధనలు అమలు కాలేదని, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని రాము ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ పదేళ్ల కాలంలో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులను పిలిపించి వారి వివరణ కూడా తీసుకున్నారు. మరోసారి విచారణకు హాజరవుతానని, రికార్డులు సమగ్రంగా సిద్ధం చేసి ఉంచాలని ఆమె ఆదేశించారు. కొన్ని రికార్డుల్లో పంచాయతీ కార్యదర్శులు సంతకాలు కూడా లేకపోవడంతో ఆమె గుర్తించి పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విచారణకు పంచాయతీ కార్యదర్శులు ఎర్ర రమణ, తవుడు, రమేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.శంకర్, జగన్నాథం పాల్గొన్నారు.

బాల్య వివాహంతో ఆడబిడ్డ బతుకు నాశనం

శృంగవరపుకోట రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో ఆడబిడ్డల భవిష్యత్తు నాశనం అవుతుందని ఎస్.కోట ఐసీడీఎస్ పీవో అచ్యుత అన్నారు. శుక్రవారం కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సర్పంచ్ లక్ష్మి, సూపర్‌వైజర్ సుశీల, కార్యకర్త రామలక్ష్మి, కార్యదర్శి ధనలక్ష్మి, ఏఎన్ఎం స్వప్నకుమారి పాల్గొన్నారు. అలాగే ముషిడిపల్లి గ్రామంలో కార్యకర్త భారతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగరత్నం, పంచాయతీ కార్యదర్శి అనీల్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక షెడ్ తొలగింపుపై గ్రామసభ

పూసపాటిరేగ, జూలై 18(ఆంధ్రజ్యోతి): కొవ్వాడ అగ్రహారం గ్రామంలో నిర్మించిన శ్మశానవాటిక షెడ్‌ను ఆ గ్రామస్థులు కొందరు కూల్చివేశారు. దీనిపై ఆ గ్రామానికి చెందిన మరికొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో రాధిక విచారణ చేపట్టారు. శ్మశానవాటిక షెడ్డును ఎవరు తొలగించారో చేతులు ఎత్తాలని ఆమె కోరగా.. గ్రామస్థులందరూ చేతులు ఎత్తారు. ఏదైనా చర్యలు ఉంటే అందరిపైనా తీసుకోవాలన్నారు. గ్రామ కట్టుబాట్లు విరుద్ధంగా ఈ నిర్మాణాన్ని చేపట్టారని, అందుకే తొలగించామని.. గ్రామ సంప్రదాయాలను గౌరవించాలని అధికారులపై మండిపడ్డారు. విచారణకు ఫిర్యాదుదారులు ఎందుకు హాజరు కాలేదని గ్రామస్థులు ప్రశ్నించారు. అనంతరం గ్రామస్థుల వద్ద సంతకాలు తీసుకున్నారు.

టీడీపీ నుంచి ఆనందరావు బహిష్కరణ

విజయనగరం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరం పట్టణం 28వ డివిజన్‌కు చెందిన తీగెల ఆనందరావును టీడీపీ నుంచి బహిష్కరిస్తున్నట్టు పార్టీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆనందరావు పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తూ, పార్టీ నాయకులను సామాజిక మాధ్యమాల్లో దుర్భాషలాడుతూ, పార్టీ ప్రతిష్టకు నష్టం కలిగే విధంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. దీంతో ఆనందరావును పార్టీ నుంచి బహిష్కరించామని ఆయన తెలిపారు.

మహిళల భద్రతకు శక్తి వారియర్ టీంలు

నెల్లిమర్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో మహిళల భద్రత కోసం శక్తి వారియర్ టీంలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. నెల్లిమర్లలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ప్రతి తరగతి నుంచి వారియర్ టీంను నియమించనున్నట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పీవో సంధ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శృంగవరపుకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ దస్తగిరి, ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆ కళాశాలలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ (ఈగల్ క్లబ్) ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మో.. జ్వరం

(5వ పేజీ తరువాయి)

వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. అయితే వసతి సమస్య పరిష్కారం కాకపోవడం, వివిధ పరీక్షలకు చెందిన యంత్ర సామగ్రిని ఇంకా అమర్చక పోవడంతో



సాలూరు ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న జ్వర పీడితులు

రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక రోజూ ఆసుపత్రిలో 150 నుంచి 200 మందికి అందించే భోజనం బాగోడం లేదని రోగులు చెబుతున్నారు. కేవలం రూ.70తో రోగులకు మూడు పూటలా ఆహారం అందజేయడం కష్టంగా మారిందని, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని భోజన నిర్వాహకులు చెబుతున్నారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని సూపరింటెండెంట్ మీనాక్షి తెలిపారు.

రోగులతో కిటకిట

పాలకొండ: పాలకొండ ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతుంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో రోజూ సరాసరి 400 వరకు ఓపీ నమోదవుతుంది.



పాలకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

మలేరియా, టైఫాయిడ్, డయేరియా, వైరల్ జ్వరాలతో అత్యధికులు ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. దీంతోఆసుపత్రిలో ఉన్న వంద పడకలు రోగులతో నిండిపోయాయి. కాగా గత వారం వరకు అందుబాటులో ఉన్న జనరల్ మెడిసిన్ వైద్యుడు సుధీర్ ఉన్నత చదువులకు వెళ్లిపోయారు. రెగ్యులర్ రేడియాలజిస్ట్ లేకపోవడంతో వారానికి కేవలం రెండు రోజులు మాత్రమే స్కానింగ్‌లు చేపడుతున్నారు. ఆక్సిజన్ లేక ఐసీయూ వైద్య సేవలు అందడం లేదు. కాగా రోగులకు అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్నామని ఏరియా ఆసుప్రతి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ చిరంజీవి తెలిపారు.

చెరకు ఫ్యాక్టరీకి పూర్వవైభవం వచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

చెల్లించారు. పంచదార నిల్వలను వేలం వేయగా వచ్చిన రూ.11.5 కోట్లను కూడా రైతుల బకాయిలకే కేటాయించాల్సి వచ్చింది. ఇంకా మిగిలి ఉన్న పాతిక ఎకరాల భూములను కూడా బహిరంగ వేలం వేశారు. ఈ వెంటనే క్రషింగ్ జరపలేమని యాజమాన్యం చేతులెత్తేసింది. ఇంత జరిగినా వైసీపీ ప్రభుత్వం సహకరించలేదు. ఫ్యాక్టరీని రక్షించుకునే చర్యలు తీసుకోలేదు.

● వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఫ్యాక్టరీని మళ్లీ జాతీయం చేయాలని టీడీపీ, సీపీఎం, సీపీఐ, జనసేన పార్టీలతో పాటు కార్మిక, రైతు సంఘాల నాయకులు పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. చెరకు రైతులకు గట్టి భరోసా ఇచ్చే ప్రయత్నమేదీ ఆ ప్రభుత్వం చేయలేదు. ఒక్కగానొక్క చెరకు పరిశ్రమ మనుగడను కాపాడాలని, ప్రత్యేక ప్యాకేజీ, రాయితీలను ప్రకటించి ఫ్యాక్టరీని తిరిగి తెరిపించాలని కూటమి ప్రభుత్వాన్ని వారంతా కోరుతున్నారు.

మన్యం అభివృద్ధికి సహకరిస్తాం

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. జిల్లాలో ఎటువంటి ఉన్నత విద్యాసంస్థలు లేవని గుర్తుచేస్తూ కేంద్రం ప్రత్యేకించి నిధులు కేటాయించి ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏకలవ్య, కేజీబీవీ, నవోదయ విద్యాలయాలు నెలకొల్పాలన్నారు. జిల్లాలో వైద్య నిపుణులు అందుబాటులో లేరని, నీతి ఆయోగ్ ద్వారా ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ..' వివిధ కార్యక్రమాల అమలులో లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకుని ముందుకెళ్లాలి. రానున్న రోజుల్లో ప్రగతి పథంలో పయనించాలి. కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు మంజూరుకు ప్రయత్నిస్తాం.' అని తెలిపారు. ఈ సమావేశంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

బలిజిపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించకుంటే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ



బలిజిపేటలో మాట్లాడుతున్న పీడీ కనకదుర్గ

కనకదుర్గ హెచ్చరించారు. శుక్రవారం బలిజిపేటలో సీతానగరం, బలిజిపేట మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..' ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణులకు ఎస్ఆర్ఎస్ ద్వారా సరుకులివ్వాలి. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు పీపీ1, పీపీ2 పుస్తకాలు అందించాలి. అంగన్‌వాడీ కార్యకర్తలంతా సేవభావంతో పనిచేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. ఈ విషయంలో కార్యకర్తలు ప్రధాన పాత్ర పోషించాలి.' అని ఆదేశించారు.

సర్వేలను త్వరితగతిన పూర్తి చేయండి

తెర్లాం, జూలై18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సుపరిపాలను అందించేందుకు సర్వేలను త్వరగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో రేగు రాంబాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేరు అసిస్టెంట్లు, మహిళ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పి-4 సర్వేలో బంగారు కుటుంబాల దత్తత, అన్నీ పంచాయతీల్లో శానిటేషన్ ప్రక్రియ త్వరగతిన చేయాలన్నారు. పంచాయతీ ఆడిటర్ శ్రీనివాసరావు పాల్గొని అధికారులకు పలు చూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి నీలిమ పాల్గొన్నారు.

చెత్తసేకరణ పరిశీలన

బొబ్బిలి రూరల్, జూలై18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురంలో శుక్రవారం ఎంపీడీవో రవికుమార్ పర్యటించారు. గ్రామంలో చెత్త సేకరణను పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని గ్రీన్ అంబాసిడర్లను ఆదేశించారు. ఖాళీ స్థలాలు, రోడ్లపై కాలువల్లో చెత్త వేయకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలిచ్చారు. చెత్త సేకరణ వాహనాలు ఇంటింటికీ వస్తున్నాయా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు ఉన్నారు.

అన్ని అసెస్‌మెంట్లకు పన్ను విధించాలి

బొబ్బిలి, జూలై18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘం పరిధిలో అండర్ అసెస్‌మెంట్లు, అన్ అసెస్‌మెంట్లు గుర్తించి వాటన్నింటికీ పన్ను విధించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. రెవెన్యూ అధికారులు, సచివాలయం అధికారులతో ఆమె తన కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అన్ని సచివాలయాల పరిధిలో పన్ను బకాయిదారులకు డిమాండ్ నోటీసులను బట్వాడా చేయాలన్నారు. అడ్మిన్ సెక్రటరీల ద్వారా రెవెన్యూ సేవలు అమలయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్వో నాగరాజు, ఆర్ఐ సురేష్ బాబు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో ఆనందం

గుమ్మలక్ష్మీపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలంతా ఆనందంగా ఉన్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేటలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకుల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దన్నారు. అనంతరం మండలంలోని భద్రగిరిలో పశువుల ఆసుపత్రి నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నరేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రోడ్డు సౌకర్యం కల్పించండి

●కురుపాం, జూలై18 (ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురం పంచాయతీ సాలిడంగూడ నుంచి సిరికొండ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సిరికొండ గ్రామస్థులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతిపత్రం అందజేసారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమెను కలిసి తమ సమస్యను వివరించారు. ఎన్నో సార్లు అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైన తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడానికి కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

పాలకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన బిడ్డిక సంధ్యారాణి.. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను శుక్రవారం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న సంధ్యారాణి

మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెతో పాటు జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, కడగల లక్ష్మనాయుడు, అలజంగి రాంబాబు ఉన్నారు. జూలై 29 న ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను సంధ్యారాణి ఆహ్వానించారు.

ఎరువులు తక్షణమే సరఫరా చేయాలి

పాలకొండ, జూలై18 (ఆంధ్రజ్యోతి): రైతులు నాట్లకు సిద్ధమవుతున్న నేపథ్యంలో డీఏపీ, యూరియా ఎరువులను తక్షణమే సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సేవాకేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ మార్కెట్‌లో ఎరువులను కొనాల్సి వస్తోందన్నారు. వ్యవసాయ మదుపులు పెరిగిన నేపథ్యంలో ఎదలపై రైతులు మక్కువ చూపుతన్నారన్నారు. ఎదపంట వేసిన 20 రోజుల్లో డీఏపీ ఎరువు వేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు కిమిడి రామ్మూర్తినాయుడు, త్రిపురాంతకరావు, పచ్చల లక్ష్మణ తదితరులున్నారు.

పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

గరుగుబిల్లి, జూలై18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్



కొంకడివరంలో పర్యటిస్తున్న ప్రత్యేక అధికారి

హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కొంకడివరంలో పలు వీధులను ఎంపీడీవో జి.పైడితల్లితో పాటు ప్రత్యేకాధికారి పరిశీలించారు. పారిశుధ్యలోపంపై పంచాయతీ కార్యదర్శి వైకుంఠరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలితే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తప్పవన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. అనంతరం నాగూరులో డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు పర్యటించారు. దోమలు విజృంభించకుండా అవసరమైన చర్యలకు ఆదేశించారు.

పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టండి

●సీతంపేట రూరల్, జూలై18 (ఆంధ్రజ్యోతి): పంచాయీలో పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి జి.చిన్నబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపునకు సూచనలు, సలహాలు అందజేశారు. పీ-4 సర్వేలో భాగంగా గ్రామసభలు, బంగారు కుటుంబం తుది జాబితా తయారీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీడీవో మిశ్రో, డిప్యూటీ ఎంపీడీవో సత్యం పాల్గొన్నారు.

పరిశుభ్రతతో రోగాలకు దూరం

●కొమరాడ, జూలై18 (ఆంధ్రజ్యోతి): దోమలు వ్యాప్తిని నియంత్రించడంలో డ్రైడే కీలకమైనదని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు అన్నారు. విక్రంపురంలో శుక్రవారం ఆయన పర్యటించారు. డ్రైడే- ఫ్రైడే అమలు తీరును పరిశీలించారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న చిన్నారి ఆరోగ్యంపై ఆయన ఆరా తీశారు. అనతరం అక్కడ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. మందులు, వైద్య పరీక్షల తీరు పరిశీలించారు. ఎన్‌సీడీ సర్వేపై ఆరా తీసి దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. ప్రతి వారం తాగునీటి నాణ్యత పరీక్షలు చేపట్టాలన్నారు. ఆయనతో పాటు డాక్టర్ కౌశిక్, వైద్య సిబ్బంది అనూష, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

●కొమరాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించి వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీడీవో రమేష్ అన్నారు. గుమ్మడలో పారిశుధ్య పనులను శ క్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో కాలువలు అధ్వానంగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభ ఏర్పాటు చేసి బంగారు కుటుంబాలకు దత్తత తీసుకున్న వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి రాధాకృష్ణ ఉన్నారు.

టైలరింగ్‌లో నైపుణ్యం సాధించండి

సీతానగరం, జూలై18 (ఆంధ్రజ్యోతి): టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలంతా నైపుణ్యం సాధించాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. గతంలో కుట్టు మూర్తులు తయారీ శిక్షణకేంద్రాల్లో శిక్షణ పొందిన వారు ప్రస్తుతం బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు మూర్తులు తయారీకి శిక్షణ ఇస్తున్నారన్నారు. ఇప్పటికే 30 మంది వరకు కుట్టు మూర్తులు తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కురుపాం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కారించాలని ఎంపీపీ శెట్టి పద్మావతి కోరారు. ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

డీవో జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల సమావేశానికి విద్యాశాఖ అధికారులు రాకుండా సిబ్బందిని పంపించడంపై ఎంపీపీ మండిపడ్డారు. మూడు నెలకోసారి నిర్వహించే సమావేశానికి వారు రాకుంటే ఎలా అని ఆమె ప్రశ్నించారు. వారికి మెమోలు ఇవ్వాలని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవోకు సూచించారు. నీలకంఠాపురం సర్పంచ్ మన్మథరావు మాట్లాడుతూ చాలామంది పిల్లలకు తల్లిక వందనం అమలు కాలేదన్నారు. కురుపాం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కె.సందీప్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కారణంగా ఆసుపత్రికి జ్వరాలతో అధికంగా వస్తున్నారని వారికి వైద్యసేవలు అందస్తున్నామన్నారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ జిలానీ మాట్లాడుతూ కురుపాంలో ఆసుపత్రి అదనపు భవనం పనులు 90 శాతం మేర పూర్తయినప్పటికీ దాన్ని ప్రారంభించకపోవడంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులు ఉండే పరిస్థితి నెలకొంటోందన్నారు. ఎరువుల కొరతపై వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎరువులు ఇండెంట్ పెట్టామని మరి కొద్ది రోజుల్లో వస్తాయన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.జయ, జడ్పీటీసీ సభ్యురాలు సుజాత, వైస్ ఎంపీపీ అన్నాజీరావు, ఏవో నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సులను నడపండి

పాలకొండ/ సీతంపేట రూరల్, జూలై18 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల కోసం పాలకొండ నుంచి శంభాం వరకు ఆర్టీసీ బస్సులను నడపాలని గిరిజన సలహామండలి



వినతిపత్రం అందజేస్తున్న మాలయ్య

సభ్యుడు సవర మాలయ్య కోరారు. పాలకొండ ఆర్టీసీ డిపోలో శుక్రవారం మేనేజర్ పట్నాన వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులను అందుబాటులోకి తేవాలని కోరారు. ఆయనతో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు నిమ్మక నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవండి



మాట్లాడుతున్న డీఐఈవో నాగేశ్వరరావు

వీరఘట్టం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ త్రినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల పెంపకం లాభదాయకం

సీతంపేట రూరల్, జూలై18 (ఆంధ్రజ్యోతి): పాడి పశువుల పెంపకంతో అధిక ఆదాయం సమకూరుతుందని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. స్థానిక వైటీసీలో శుక్రవారం పాడి పశువుల పెంపకానికి సంబంధించిన పద్ధతులపై మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ గిరిజనులకు గోకులం పథకం ద్వారా పాడి పశువులను అందజేస్తామన్నారు. వాటిని సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. శిక్షణలో మేలుజాతి పాడి పశువులు ఎంపిక, నిర్వహణ, పశుగ్రాసం పెంపకం, గోశాల నిర్వహణ తదితర అంశాలపై ఫొటోలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌వో ఆర్‌వీ గణేష్, వెటర్నరీ ఏడీ శ్రీనివాసరావు, ఏపీఎం కమలకుమారి పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న సూర్యనారాయణ

పార్వతీపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడమే పీఆర్‌టీయూ లక్ష్యమని ఆ యూనియన్ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని ఉన్నత పాఠశాలలన ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలల్లో సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు విజయ్, జక్కు రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో అగ్ని ప్రమాదం

వీరఘట్టం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ప్రధాన రహదారిలో శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. యూనియన్ బ్యాంకు పక్కన ఉన్న ప్రైవేట్ గోనె సంచుల గోదాంలో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో



చెలరేగిన మంటలు

స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పాలకొండ, పార్వతీపురం అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. ప్రధాన రహదారిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు.

కుక్కల దాడితో భయం.. భయం

గరుగుబిల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావపల్లిలో కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడి చేస్తున్నాయి. గురువారం ఇద్దరు చిన్నారులు గుల్ల సాయికుమార్, సుమంత్‌లపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. శుక్రవారం కుమ్మరి సూరమ్మపై దాడి చేశాయి. ఆమె చేతిపై గాయం చేశాయి. కుక్కల సమస్యపై అధికారులకు తెలియజేసినా ఎలాంటి చర్యల్లేవని స్థానికులు అంటున్నారు. మూడు రోజులుగా పలువురిపై



సూరమ్మ చేతిపై కుక్క కరిచిన దృశ్యం

కుక్కలు దాడులు చేస్తుండటంతో టీడీపీ నాయకుడు బోను సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు.

పణుకువాని చెరువుకు గండి

మక్కువ రూరల్,జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూరుమామిడిలోని పణుకువాని చెరువుకు శుక్రవారం భారీ గండి పడింది. దీంతో ఈ చెరువు దిగువన సుమారు 160 ఎకరాల్లో వరి నారుమళ్లు ముంపు గురయ్యాయని తూరుమామిడి సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడు తెలిపారు. ఈ చెరువును కలుపుతూ లింక్ చానల్ ద్వారా పొలాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే చెరువుకు గండి పడి చెరువులో నీరు వృథాగా



చెరువుకు గండిపడిన దృశ్యం

పోతోంది. అధికారులు వెంటనే గండిని పూడ్చాలని రైతులు కోరారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

పార్వతీపురం టౌన్, జూలై18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన యువకుడు అజయ్‌కుమార్ అదృశ్యమైనట్టు పట్టణ ఎస్ఐ గోవిందరావు తెలిపారు. పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన బి.శ్రీనివాసరావు కుమారుడు బి.అజయ్ ఈనెల 17న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు 18న రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ మాట్లాడుతూ అజయ్ ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో నీలం కలర్ ప్యాంటు, క్రీమ్ కలర్ టీషర్టు ధరించాడని తెలిపారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడవద్దు



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాలూరు, జూలై18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సఫాయి అప్నావో బిమారీ బాగావో కార్యక్రమంలో భాగంగా కమిషనర్ బి.వి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ శుక్రవారం పట్టణంలో పర్యటించారు. కూరగాయల వ్యాపారులు, చిల్లర వ్యాపార దుకాణదారులతో మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకూడదన్నారు. గుడ్డ కవర్లు విక్రయాలు జరపాలన్నారు. వ్యాపారాల తరువాత వ్యర్థాలను రోడ్లపై విడిచిపెట్టకుండా పారబోయకుండా మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు. లేకుంటే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీపీగా గంటి గోపాలకృష్ణ శర్మ

బొబ్బిలి, జూలై18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పరిధిలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది గంటి గోపాలకృష్ణ శర్మ నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఆయన ఏపీపీగా సేవలందించనున్నారు. శర్మ నియామకంపై స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, నంది హరిప్రకాశ్, పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.